

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌గా ప్రవీణ్‌కుమార్

కడప (రూరల్), ఆగస్టు 24: ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌గా ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తున్న అధికారి బదిలీ కావడంతో ఆయన స్థానంలో కాశినాయన మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది.

మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్



గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

- క్షేత్ర స్థాయి అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

కడప(కలెక్టరేట్), ఆగస్టు 24: పేదల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పేదల గృహ నిర్మాణ పనుల పురోగతిపై హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలసి క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాల విషయంలో రాజీ పడకుండా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు గృహ నిర్మాణాలను నాణ్యతగా చేయాలన్నారు. పనులు జరుగుతున్న లేఅవుట్లలో ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అక్టోబరు 2 నుంచి ప్రారంభం కానున్న గృహ నిర్మాణ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ గృహ నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. మెటీరియల్, లేబరు, కాంపోనెంట్, బిల్లులపెండింగ్, ఇసుక, ఇనుము, నీరు, రోడ్లు తదితర అంశాల్లోని సమస్యలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టర్ సమీక్షించారు. పేదల ఇళ్ల నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, డీపీవో ప్రభాకర్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, డ్వామా పీడీ జోయల్ విజయకుమార్, నగర కమిషనర్ వైపీ నందన్ తదితరులు పాల్గొన్నారు.

గ్లైఫోసెట్ అమ్మితే చర్యలు తప్పవు

- ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరిక

పులివెందుల రూరల్, ఆగస్టు 24: అనుమతి లేని గ్లైఫోసెట్ మందు అమ్మితే చర్యలు తప్పవని పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఈనెల 16వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'గ్లైఫోసెట్... యమడేంజర్' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పులివెందుల డివిజన్ పరిధిలోని పులివెందుల, వేముల, లింగాల మండలాలకు చెందిన పురుగుమందులు, ఎరువుల, విత్తనాల డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ దుకాణాల్లో నిషేధిత మందులు ఎట్టిపరిస్థితుల్లోను ఉండకూడదని, ఒకవేళ ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే షాపులో లైసెన్స్ కనిపించే విధంగా ఏర్పాటు చేయాలని, అనుమతులు ఉన్న మందులు మాత్రమే అమ్మాలన్నారు. అమ్మిన వాటికి కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని, రోజువారీ అమ్మకాల తర్వాత స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసి షాపులో ఉన్న స్టాక్‌తో సరిపోవాలన్నారు. నాణ్యమైన మందులు అమ్మి రైతుల శ్రేయస్సు కోసం పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓలు సునీల్‌కుమార్‌రెడ్డి, నాగలక్ష్మి, చెన్నారెడ్డి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


రాయలసీమ జైళ్లశాఖ అదనపు డీఐజీగా రాజేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



కడప (క్రైం), ఆగస్టు 24 : రాయలసీమ జైళ్ల శాఖ అదనపు డీఐజీగా కె.రాజేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే కడప సెంట్రల్ జైలు పర్యవేక్షణ అధికారిగా కూడా ఆయన బాధ్యతలు స్వీకరించారు. విజయనగరానికి చెందిన ఈయన 2007 బ్యాచ్‌కు చెందిన గ్రూప్-1 అధికారి. ఉమ్మడి రాష్ట్రంలోని పలు జైళ్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైలులో పనిచేస్తూ అటు రాయలసీమ డీఐజీగా అదనపు బాధ్యతలతో పాటు కడప సెంట్రల్ జైలు పర్యవేక్షణ అధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు అభివృద్ధికి కృషి చేస్తామని, ఖైదీలకు రావాలసిన అన్ని సదుపాయాలను కేటాయిస్తామన్నారు.

కడపలో తెలుగుదేశం గెలవాలన్నది కరుడుగట్టిన కార్యకర్తల ఎన్నో ఏళ్ల కల. అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ జెండాలు మోస్తూనే వచ్చారు. ఈ సారి ఎన్నికల్లో టీడీపీ పక్కా గెలుపు అనుకుంటూ ప్రతి ఎన్నికల్లో ఫైట్ చేశారు. అయితే ఫలితం మరోలా వచ్చేది. మాజీ ఎమ్మెల్యే అంజద్‌బాషా డిప్యూటీ సీఎంగా ఉన్న సమయంలో కడపలో ఎటు చూసినా భూకబ్జాలు సెటిల్‌మెంట్లు రాజ్యమేలాయి. ఈయన మళ్లీ గెలిస్తే మా పని గోవిందా అని జనం భయపడి టీడీపీకి ఓటు వేసి గెలిపించారు. ఐదేళ్లు కష్టాల్లో ఉన్న సమయంలో కంటికి కనిపించని ఓ నేత.. ఇప్పుడు అధికారం చేపట్టగానే అంతా తానై వ్యవహరిస్తున్నారు. ఎంతలా అంటే చివరకు చౌకదుకాణాల పేరిట టీడీపీ వారి నుంచి కూడా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇది టీడీపీ హార్డ్‌కోర్ అభిమానులను ఆవేదనకు గురిచేస్తోంది.





కడపలో కృష్ణ లీలలు

- టీడీపీలో చక్రం తిప్పుతున్న ఆ నేత
- రెవెన్యూపై పెత్తనం
- చౌకదుకాణాల పేరిట రూ.25వేల నుంచి రూ.75వేలు వసూళ్లు ?
- మట్టి తవ్వకాల్లోనూ ఆయనే కీలకం
- బదిలీల సిఫారసు లేఖల్లోనూ చిలక్కొట్టుడు
- కడప టీడీపీలో హాట్‌టాపిక్‌గా ఆయన తీరు

(కడప-ఆంధ్రజ్యోతి): గాడి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలన్నా, కడపలో కబ్జారాయుళ్ల ఆట కట్టించాలన్నా మళ్లీ చంద్రబాబు రావాలంటూ ఓటర్లు డిసైడ్ అయి టీడీపీకి పట్టంకట్టారు. అయితే అధికారంలోకి వచ్చాక టీడీపీలో కొందరి వ్యవహారం చూస్తే గాడి తప్పినట్లు కనిపిస్తోంది. భూకబ్జాలు సెటిల్‌మెంట్లు రౌడీయిజాన్ని సహించమని ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి చెబుతున్నారు. కార్యకర్తలను ఆదుకుంటామని అంటున్నారు. ఏదైనా సమస్య ఉన్నప్పుడు కొందరికి భరోసా ఇస్తున్నారు. అయితే ఎన్నికల ముందు టీడీపీలోకి వచ్చిన, గత ఐదేళ్లు కార్యకర్తలను పట్టించుకోని వారు ఇప్పుడు అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న టీడీపీ వీరాభిమానులందరినీ సైడ్ చేసేశారు. వలస పక్షుల మాదిరిగా పార్టీలో అడుగు పెట్టిన కొందరు ఇప్పుడు అన్నీ తామై చక్రం తిప్పడం హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా పాత కడపకు చెందిన ఓ నేత వ్యవహారం కడప టీడీపీలో చర్చనీయాంశంగా మారింది. టీడీపీ అధికారంలో ఉన్న 2014-19 కాలంలో నీరు-చెట్టు ఇతరత్రా వాటి ద్వారా బాగా లబ్ధి పొందిన ఆ నాయకుడు పార్టీ అధికారం కోల్పోయాక.. ఐదేళ్ల పాటు దూరంగా ఉంటూ వచ్చాడు. ఆర్.మాధవికి టికెట్ ఇవ్వడంతో ఎన్నికల సమయం నుంచి ఆయన మళ్లీ యాక్టివ్ అయ్యాడు. ఇప్పుడు అధికారం వచ్చాక అంతా తానై వ్యవహరించడం మొదలు పెట్టారు. ముఖ్యంగా కడప రెవెన్యూపై ఆయనే పెత్తనం సాగిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. అందులేడు ఇందులేడన్నట్లుగా కడపలో ఇటీవల చోటు చేసుకున్న కొన్ని వ్యవహారాల్లో ఆయన పేరు ప్రథమంగా వినిపిస్తోంది. వైసీపీకి మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు కబ్జాలు సెటిల్‌మెంట్లతో చెడ్డ పేరు వచ్చింది. ఇటీవల టీడీపీలో యాక్టివ్ అయిన ఆ నేత మట్టి తవ్వకాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కార్యకర్తల పేరు చెప్పి మట్టి తవ్వకుని వెనకేసుకుంటున్నారని అంటున్నారు.

చౌక దుకాణాల మార్పుతో..

ప్రభుత్వం మారినప్పుడు ఇన్‌చార్జి డీలర్లను మార్చుకుని వారి అనుచరులకు తెచ్చుకుంటారు. కడపలో 123 చౌక దుకాణాలు ఉండగా వీటిలో 40 ఇన్‌చార్జిల చేతిలో ఉన్నాయి. చౌకదుకాణాలను టీడీపీ గెలుపుకోసం కష్టపడ్డ వారికి ఇవ్వాలని నిర్ణయించారు. ఆ నేత దానిని కూడా క్యాష్ చేసుకున్నట్లు చెబుతారు. డీలర్‌షిప్ మార్చినందుకు అధికారులకు డబ్బులు ఇవ్వాలంటూ రూ.25వేల నుంచి రూ.75వేల దాకా వసూలు చేసినట్లు సమాచారం. అలా వసూలు చేసిన డబ్బులను అధికారులకు ఇవ్వకుండా ఈయనే జేబులో వేసుకున్నట్లు చెబుతారు. ఈ విషయం అధికారులకు తెలవడంతో వారు అవాక్కయ్యారని అంటున్నారు. ఈ వ్యవహారం బయటపడడంతో కొందరు ఇన్‌చార్జి డీలర్లు న్యాయస్థానానికి వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఇప్పుడు బదిలీల్లో కూడా చక్రం తిప్పడం చూసి కొందరు టీడీపీ శ్రేణులు ఇదెక్కడి చోద్యం.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అడ్రస్ లేకుండా పోయి ఇప్పుడు పెత్తనమా అంటూ మదనపడుతున్నారు. ఈయనను ఇలాగే వదిలేస్తే.. టీడీపీకి చెడ్డపేరు వస్తుందని ఆ పార్టీ నేతలు పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బది'లీలలు'

రాష్ట్ర ప్రభుత్వం బదిలీలకు పచ్చజెండా ఊపింది. పలువురు ఉద్యోగులు కోరుకున్న చోటుకు వెళ్లేందుకు ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసు లెటర్లు తీసుకోవడం సహజం. ఈ బదిలీల ప్రక్రియను కూడా ఆయన బాగా వాడుకున్నట్లు చెబుతున్నారు. కడపలో వీఆర్వో పోస్టింగ్ కావాలన్నా, సర్వేయర్లు మిగతా ఏ పోస్టులైనా సరే.. తాను చెప్పితేనే జరుగుతుంది అంటూ ఉద్యోగస్తులను బురిడీ కొట్టిస్తున్నాడని చెబుతున్నారు. కొందరి నుంచి ఆమ్యామ్యాలు తీసుకున్నట్లు సమాచారం. పోస్టును బట్టి 'ల'కారంపైనే డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. కడపలో ఏడుగురు వీఆర్వోలు ఉన్నారు. కొందరికి తప్పనిసరిగా బదిలీలు జరుగుతాయి. నగరం చుట్టూ విస్తరిస్తుండటంతో ఇక్కడ నివాస స్థలాలకు డిమాండ్ ఉంది. తను అనుకూలురైన వారిని వేయించుకుని ఖాళీ స్థలాలను ఆక్రమించే విధంగా ఆయన ప్లాన్లు చేసినట్లు చెబుతున్నారు. వైఎస్సార్ లేఅవుట్, వైఎస్సార్ కాలనీలలో కొన్ని ప్లాట్లు, ఇతర చోట్ల విలువైన ఖాళీ స్థలాలున్నాయి. అనుకూలురైన వారిని నియమించుకుని ఆ స్థలాలకు స్పాట్ పెట్టాలని చూస్తున్నట్లు సమాచారం. ఇక మిగతా పోస్టింగుల కోసం భారీ స్థాయిలోనే ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు టీడీపీలో చర్చ నడుస్తోంది.

అత్యధిక కేసులు పరిష్కరించాలి

- లోక్ అదాలత్‌ను అగ్రస్థానంలో నిలపాలి
- జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప (రూరల్), ఆగస్టు 24: ఉమ్మడి కడప జిల్లాలో సెప్టెంబర్ 14న నిర్వహించే నేషనల్ మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి అందరూ కృషిచేయాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో జిల్లా వ్యాప్తంగా న్యాయమూర్తులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి మాట్లాడుతూ రానున్న నేషనల్ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులను పరిష్కరించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలనే కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. ఇందుకు న్యాయమూర్తులు వారి వారి కోర్టులలో వీలైనన్ని ఎక్కువ కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. రాజీ పడే కేసులను నేషనల్ మెగా లోక్ అదాలత్‌కు వచ్చేలా చూడాలన్నారు. వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కక్షిదారులు లోక్‌అదాలత్‌లో రాజీపడేలా అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులకు ఎటువంటి ఖర్చు ఉండదని తెలియపరచాలన్నారు. సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఇక్కడ పరిష్కారం అయిన కేసు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమైందన్నారు. తిరిగి అపీల్ వెళ్లడానికి వీలుపడదన్నారు. లోక్‌అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి, రెండవ, నాల్గవ, ఐదవ, ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారులు ఎల్.వెంకటేశ్వరరావు, జి.ఎస్. రమేశ్, జి.దినబాబు, ఎస్.కృష్ణన్‌కుట్టి, షేక్ ఇంతియాజ్ అహమ్మద్‌తో పాటు ఆయా కోర్టుల న్యాయాధికారులు పాల్గొన్నారు.

పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తా

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 24: జిల్లాలో వైసీపీకి పూర్వవైభవం తీసుకువస్తామని మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి అన్నారు. శనివారం కడపలోని పార్టీ కార్యాలయంలో ఆయన వైసీపీ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థలు, సర్పంచ్, ఇతర ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగరవేసేలా కృషి చేస్తామన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాయకుల సమన్వయంతో ముందుకు వెళతామని తెలిపారు. 2029 ఎన్నికల్లో తిరిగి సీఎంగా జగన్‌ను గెలిపించకుంటామని, ప్రతి కార్యకర్తకు అండగా నిలబడతామన్నారు. అనంతరం రవీంద్రనాథరెడ్డికి ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, దాసరి సుధ, ఎమ్మెల్సీలు గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుభాకాంక్షలు తెలిపారు.

చెత్త డోర్ కలెక్షన్ చేయకుంటే.. మేయర్ ఇంటిలో వేయండి

- ప్రభుత్వంపై బురద చల్లితే సహించం
- ఎమ్మెల్యే ఆర్.మాధవి



కడప(ఎడ్యుకేషన్), ఆగస్టు 24: చెత్త డోర్ కలెక్షన్ చేయకుంటే మేయర్ ఇంటిలో వేయాలని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. శనివారం కడపలోని టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కడప మేయర్‌గా ఉన్నది ప్రజల సేవ కోసమా లేక పార్టీ కార్యక్రమాలకా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చే జీవోలపై ఏ మాత్రం ఆయనకు అవగాహన లేదన్నారు. పారిశుధ్యానికి సంబంధించిన ఖర్చులు సంబంధిత కార్పొరేషన్‌లే భరించాలని జీవోలో ఉందన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత సృష్టించేందుకు ఒక పథకం ప్రకారం కార్పొరేషన్ పాలకవర్గం కొనసాగుతోందన్నారు. చెత్త డోర్ టు డోర్ కలెక్షన్ చేయకుండా ఆపేయమని చెప్పడం దుర్మార్గమన్నారు. 20 వాహనాలు తగ్గించి కడపనగరాన్ని చెత్తమయం చేయాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. ఎమ్మెల్యేకు కార్పొరేషన్ చెత్తకు ఎటువంటి సంబంధం లేదన్నారు. చెత్తను సేకరించే బాధ్యత ఆ డివిజన్ కార్పరేటర్లదన్నారు. 9వ డివిజను కార్పరేటరుకు ఫోన్ చేస్తే ఎమ్మెల్యే పేరు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చెత్త డోర్ కలెక్షన్ ఆపితే ఆ చెత్తను తీసుకెళ్లి మేయరు, కార్పొరేటరు ఇళ్లల్లోనే వేయాలన్నారు. పారిశుధ్యానికి సంబంధించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు చేయవద్దని సూచించారు.

అలాగే కడప నగరంలో గంజాయి సమస్య తీవ్రంగా ఉందన్నారు. గంజాయి తీసుకున్నా అమ్మినా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. త్వరలో టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేస్తామని, ఆ నెంబరుకు ఫోను చేస్తే త్వరితగతిన చర్యలు చేపడతామన్నారు. అలాగే కడప నగరంలో గూండాలు రోడ్లపై కూర్చుంటూ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. గూండాలు ఎంతటి వారైనా వీపులు విమానం మోత మోగిస్తామని చెప్పారు. కడప నగరంలో 222 లేఅవుట్లు ఉన్నాయని, వాటిలో 90 శాతం అక్రమ లేఅవుట్లని చెప్పారు. ప్రజలు ప్రతీది కరెక్టుగా ఉన్నాయో లేవో చూసుకుని కొనుగోలు చేయాలని తెలిపారు. ప్రభుత్వానికి సంబంధించిన భూములను ప్రభుత్వం తప్పకుండా వెనక్కి తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఎవరైనా ఎమ్మెల్యే పేరు చెప్పి ఏదైనా అక్రమాలకు పాల్పడితే వారిని నమ్మవద్దని సూచించారు. తాను ప్రజాసంక్షేమం కోసమే పనిచేస్తానని అన్నారు.

కప్పం కడితే చాలు..

- కావాల్సినంత తోలుకోవచ్చు..!
- గ్రావెల్, ఇసుక రవాణాదారులకు బంపర్ ఆఫర్
- నేతలకు టిప్పర్ ఇసుకకు రూ.3వేలు.. గ్రావెల్‌కు రూ.2500
- ఇదో రకం నయా దందా

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ పతనం కావడానికి ఇసుక, గ్రావెల్, లిక్కర్, భూదందాలు ప్రధానం. వీటి కారణంగా ఆ పార్టీని బయటికి తీయలేనంతగా జనం గోతిలో పాతేశారు. అసలు ఎవరూ ఊహించి ఉండరు ఇలాంటి రిజల్ట్ ఇస్తారని.. దందాలు, దౌర్జన్యాలు, అక్రమాలు భూదందాలు చేస్తూ విర్రవీగే వారిని జనం ఒక కంట కనిపెడతారు. అవకాశం వచ్చినప్పుడు కర్రు కాల్చి వాత పెడతారనడానికి నిన్న జరిగిన సార్వత్రిక ఎన్నికలే నిదర్శనం. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటింది. ఇసుక, భూకబ్జాలు, దాడుల జోలికి వెళ్లవద్దంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవలే టెలికాన్ఫరెన్స్ ద్వారా తెలుగు తమ్ముళ్లకు హితబోధ చేశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దంటూ గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. అయినా కొందరిలో మార్పు రాలేదు. జిల్లాలో అక్కడక్కడా వైసీపీ వాసనలే కూటమి ప్రభుత్వంలోనూ కనిపిస్తున్నాయి. కొందరు నేతలు గ్రావెల్, ఇసుకపై కన్నేసి తైలాన్ని పిండుకోవడం మొదలుపెట్టారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు కూడా లైట్ తీసుకోవడం గమనార్హం. ఇసుక, గ్రావెల్ దందాలతో నేతలు అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారు. టిప్పరు ఇసుకకు అయితే రూ.3వేలు, గ్రావెల్‌కు అయితే రూ.2500 వసూలు చేస్తుండడం ఆరోపణలకు తావిస్తోంది.



వీఎన్ పల్లె మండలం సంగమేశ్వర ఆలయం వద్ద ఇసుక కోసం కూపన్లు రాస్తున్న దృశ్యం



వీఎన్‌పల్లె మండలంలోని ఎర్రబల్లె ఇసుక యార్డులో లారీలు, టిప్పర్లు

వీఎన్ పల్లెలో ఇసుక..

ఎన్నికల హామీలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉచితంగా ఇసుకను అందిస్తున్నారు. రవాణా చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. కొత్త ఇసుక రీచ్‌లు ఇంకా మొదలు కాలేదు. స్టాకు పాయింట్‌లో ఉన్న ఇసుకనే రవాణా చార్జీలు తీసుకుని అందిస్తున్నారు. రీచ్‌ల నిర్వహణ స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. ఇంకా ఇసక పాలసీ పూర్తిస్థాయిలో కుదురుకోలేదు. అయితే కొందరు నేతలు మాత్రం ఇసుకలో కూడా చిలక్కొట్టుడు కొట్టడం దుమారం రేపుతోంది. వీఎన్‌పల్లె మండలంలోని ఎర్రబల్లి స్టాకు పాయింటులో లక్ష టన్నుల ఇసుక ఉంది. ఇక్కడ టన్నుకు రూ.340 చెల్లించి తీసుకెళ్లాల్సి ఉంది. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో విక్రయాలు జరుపుతున్నారు. మండల పరిషత్ సిబ్బంది టోకన్లు ఇస్తున్నారు. అయితే టన్నుకు చెల్లించే డబ్బులు ప్రభుత్వానికి పోతాయి, మాకేంటి లాభం అనుకున్నారేమో.. స్థానిక నేతలు కొందరు ఇసుక కోసం వచ్చే వారి నుంచి టిప్పరు, లారీకి రూ.3వేలు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇక్కడికి రోజూ వంద నుంచి 150 వరకు టిప్పర్లు, పెద్ద పెద్ద లారీలు వస్తున్నాయి. రూ.3వేలు చెల్లించే వారి వాహనాలను స్టాకు యార్డులోకి పంపిస్తున్నట్లు చెబుతున్నారు. అదనంగా ఎందుకివ్వాలని వాహనదారుడు అడిగితే వెనక్కి పోండని బెదిరిస్తున్నట్లు సమాచారం. స్టాకు పాయింటు వద్ద కూపన్లు రాయకుండా శనివారం సంగమేశ్వర దేవాలయం వద్ద టోకన్లు రాస్తున్నారు. టన్నుకు రూ.340 తీసుకుంటే టిప్పరు ఇసుక కడపకు రూ.13,500 నుంచి రూ.14వేలకు వస్తుంది. అయితే ఇప్పుడు అదనంగా రూ.3వేలు వసూలు చేస్తుండడంతో కడపలో రూ.20వేలకు విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. నేతల అదనపు వసూళ్లు జనంపై భారం పెంచుతున్నాయి. రైల్వేకోడూరు, రాయచోటి. మదనపల్లె, నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం ప్రాంతాలకు ఇక్కడ నుంచి ఇసుక తరలిస్తున్నారు.

సీకేదిన్నెలో గ్రావెల్..

సీకేదిన్నె మండల పరిధిలోని ఎస్‌టీపీసీ సమీపంలోని కొలుములపల్లె వద్ద ఉన్న పిచ్చమ్మగుట్టను గుల్ల చేసి ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కడప నగరశివారులో పెద్దఎత్తున రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. దీంతో పాటు భవనాల నిర్మాణాలు సాగుతున్నాయి. వీటికి గ్రావెల్ అవసరం. దీనిని కొందరు నేతలు బాగా క్యాష్ చేసుకుంటున్నారు. ఎక్స్‌కవేటర్లు పెట్టి గుట్టను గుల్ల చేసి టిప్పర్లకు ఎత్తుతున్నట్లు చెబుతున్నారు. ఒక్కో టిప్పరుకు రూ.2500 తీసుకుని లోడింగ్ చేస్తున్నట్లు సమాచారం. కడపలో టిప్పరు గ్రావెల్ రూ.5,500లకు విక్రయిస్తున్నారు. ఇక ఇతర ప్రాంతాలలో అయితే దూరాన్ని బట్టి రూ.8వేల నుంచి పదివేల రూపాయలు వసూలు చేస్తున్నారు. పట్టపగలే కొండను గుల్లచేస్తున్నా అడ్డుకునే వారు లేకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్కడ రూ.2500 కడితే ఎంతైనా తోలుకోవచ్చు. కడపకు తోలుకుంటే కప్పంతో పాటు డీజలు పోనూ.. ఒక్కో ట్రిప్పులో సుమారు రూ.2500లు మిగులుతుండడంతో యథేచ్ఛగా తోలేస్తున్నారు. రోజూ ఇక్కడ కూడా వంద ట్రిప్పులు రవాణా జరుగుతున్నట్లు చెబుతున్నారు.



సికెదిన్నె మండలం పిచ్చిమ్మగుట్టలో గ్రావెల్ తవ్వకాలు చేస్తున్న దృశ్యం

భక్తులతో కిటకిటలాడిన గండి క్షేత్రం

చక్రాయపేట, ఆగస్టు 24: గండి క్షేత్రం మూడవ శ్రావణ శనివారం భక్తులతో కిటకిటలాడిపోయింది. పాపాఘ్నినది భక్తులతో కోలాహలంగా కనిపించింది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మొదటి, రెండవ శనివారంతోపాటు మూడవ శనివారం అంతకురెట్టింపుగా గండికి భక్తులు తరలివచ్చారు. భక్తాలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధానఅర్చకులు రాజారమేశ్ ఆలయాన్ని పుష్పాలతో, తోమాలతో స్వామివారిని అలంకరించారు. ఉదయం 10నుంచి సాయంత్రం 5 వరకు భక్తులు భారీగా వచ్చారు. సర్వదర్శనానికి దాదాపు నాలుగు గంటలు పట్టింది. వీఐపీ దర్శనం కూడా చాలా సమయంపట్టింది. మూడవ శనివారం 30వేల లడ్డూ ప్రసాదాలు, దాదాపు 8వేల పులిహోర ప్యాకెట్లు అమ్ముడుపోయాయి. భక్తులు పాపాఘ్నిలో స్నానాలాచరించి అంజన్న దర్శనం కోసం క్యూలలో నిలిచారు. హరికథా కాలక్షేపం, కోలాట ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. భక్తులకు అంకాల్‌రెడ్డి, గోవిందమాల, బిస్మిలాబాద్, రామాంజేయరెడ్డి, రామాంజనేయులు అన్నదానం ఏర్పాటుచేశారు. ఒక్కొక్కరు దాదాపు ఐదువేల మందికి అన్నదానం చేశారు. డీఎస్పీ మురళినాయక్ ఆధ్వర్యంలో సీఐ నాగరాజు, ఎస్ఐలు భాస్కర్‌రెడ్డి, రంగారావు, 240మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు.



మూడవ శ్రావణ శనివారం సందర్భంగా గండి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు

దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల, ఆగస్టు 24: పులివెందుల జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుకు అధ్యాపక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లీలాధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25కు సంబంధించి ఖాళీగా ఉన్న ఈ కోర్సును బోధించేందుకు అవసరముందన్నారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన వారికి ఈ అవకాశం కల్పిస్తామన్నారు. అర్హతకు సంబంధించిన సర్టిఫికేట్లు జిరాక్సులతో పాటు దరఖాస్తును ఈనెల 30వ తేదీలోపు కళాశాలలో అందజేయాలన్నారు.

పాలక మండలికి నోటిఫికేషన్ విడుదల

పెండ్లిమర్రి, ఆగస్టు 24: ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన పొలతల దేవస్థానానికి సంబంధించి నూతన పాలక మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు కర్నూలు డివిజన్ ఉప కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సెప్టెంబరు 13లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితం ఛిద్రం

- వైవీయూ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పద్మ



ప్రతిజ్ఞ చేయిస్తున్న వైవీయూ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసరు పద్మ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 24: మత్తుపదార్థాలు జీవితాలను ఛిద్రం చేస్తాయని వైవీయూ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసరు పుత్తా పద్మ పేర్కొన్నారు. శనివారం వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ షిఫ్ట్‌పీఓ డాక్టర్ మృత్యుంజయరావు ఆధ్వర్యంలో డ్రగ్స్ అండ్ యాంటీ టొబాకో అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలుత సంతోషం కోసం అలవాటయ్యే మద్యం, మత్తుపదార్థాలు క్రమంగా బలహీనస్థితికి తీసుకువస్తాయన్నారు. కావున యువత అప్రమత్తగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, పొగాకు, ఖైని, ఓపీఎం, గుట్కా, మద్యం ఇవన్నీ మనిషి ఆరోగ్యాన్ని, ప్రవర్తనను దిగజారుస్తాయన్నారు. అనంతరం మత్తు రహిత సమాజం కోసం పాటుపడదామని ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ ప్రొఫెసరు రమాదేవి, పార్వతి, డాక్టర్ ప్రమీలా, మార్గరెట్, అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరి సురేశ్‌బాబు, డాక్టర్ వినయ్, చిట్టిబాబు, డాక్టర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కమలాపురం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి


ఉప ముఖ్యమంత్రి పవన్‌ను కలిసిన సీఆర్సీ, టీడీపీ సీనియర్ నేత రమణారెడ్డి

చెన్నూరు, ఆగస్టు 24:కమలాపురం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎల్‌వీ రమణారెడ్డి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరారు. శనివారం ఆయన ఎమ్మెల్సీ రామచంద్రయ్యతో కలిసి ఉప ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి ద్వారా చెన్నూరు మండలానికి అవసరమైనన్ని నిధులు తీసుకువస్తామన్నారు.

హెల్మెట్ ధరించండి.. సురక్షితంగా గమ్యం చేరుకోండి: ఎస్ఐ

సింహాద్రిపురం, ఆగస్టు 24: ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని సింహాద్రిపురం ఎస్ఐ తులసినాగప్రసాద్ సూచించారు. శనివారం ఎస్పీ ఆదేశాల మేరకు సింహాద్రిపురంలో వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలనే విషయంపై ప్రజలకు ఎస్ఐ అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. వాహనదారుడు ప్రయాణిస్తున్న సమయంలో పొరపాటున ప్ర మాదం జరిగితే తలకు హెల్మెట్ లేకుంటే జరిగే పరిణామాల గురించి వివరించారు. టూ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే జరిమానాతో పాటు కేసు నమోదు తప్పదని హెచ్చరించారు. అనంతరం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించి రికార్డులు సరిగా లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు వాహనానికి సంబందిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ దగ్గర ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐతో పాటు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

అద్దెభవనాల్లోని కార్యాలయాలను మార్చాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీటెక్ రవి

వేంపల్లె, ఆగస్టు 24: వేంపల్లె మండల కేంద్రంలో అద్దె భవనాల్లో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, పోస్టాఫీస్‌లను ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని కలెక్టర్ శివశంకర్‌ను టీడీపీ పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి కోరారు. శనివారం కడపలో ఉన్న కలెక్టర్‌ను టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, తెలుగు యువత మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మార్కెట్ ప్రాంతంలో ప్రభుత్వానికి సంబంధించిన భవనాలు ఉన్నాయని, ఆ భవనాల్లోని రెండు కార్యాలయాలను మారిస్తే ప్రభుత్వంపై అద్దెభారం తగ్గుతుందన్నారు. ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

అంజన్నను దర్శించుకున్న బీటెక్ రవి

చక్రాయపేట,ఆగస్టు 24: మూడవ శ్రావణ శనివారం గండి వీరాంజనేయస్వామిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి సతీసమేతంగా అంజన్నను దర్శించుకున్నారు. ఆయనతోపాటు మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. బీటెక్ రవికి ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, అర్చకులు కేసరి,రాఆరమేష్‌లు పూర్ణఫలంతో స్వాగతం పలికారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవు: ఎస్ఐ


జరిమానా విధిస్తున్న ఎస్ఐ అమర్‌నాథరెడ్డి

కడప (క్రైం), ఆగస్టు 24 :మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనదారులపై చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం మైనరు డ్రైవింగ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి ఒక్కరికీ ఆర్సీతో పాటు లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పక ఉండాలన్నారు. మైనర్లు ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని, ఈ మేరకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పిల్లలకు బైకులు ఇవ్వవద్దన్నారు. పోలీసు తనిఖీల్లో పట్టుబడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు


కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 24 :కడప నగరం అక్కాయపల్లెలో ఉన్న సాయిబాబా విద్యాసంస్థల్లో కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కృష్ణాష్టమి వేడుకలను ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారన్నారు. కృష్ణుడు జన్మించిన తరువాత రోజే ఉట్టి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటారని, హిందూ పంచాగం ప్రకారం శ్రావణమాసం క్రిష్ణపక్షంలో అష్టమ తిథినాడు అర్ధరాత్రి కృష్ణుడు జన్మించారన్నారు. సీఈఓ శ్రీదేవి, హెచ్ఎం సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వవిద్యార్థిని కంప్యూటర్, ప్రింటర్ వితరణ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 24 : కడప నగరం సీఎస్ఐ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని అజిత్‌కుమారి (కెనరా బ్యాంకు చీఫ్ మేనేజరు) ఆధ్వర్యంలో ఆ బ్యాంకు ఆర్ఎం కె.మురళీక్రిష్ణ సహకారంతో కంప్యూటర్, ప్రింటర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ -2 ఇర్షాద్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు బ్యాంకు వారు ప్రతి యేటా పాఠశాలలకు అవసరమైన వస్తువులు అందిస్తున్నారన్నారు. కెనరా బ్యాంకు చీఫ్ మేనేజరు అజిత్‌కుమారి మాట్లాడుతూ రీజనల్ మేనేజరు సహకారంతో కం ప్యూటర్, ప్రింటర్, అడాప్టర్ అందించామన్నారు. కెనరా బ్యాంకు మరియాపురం బ్రాంచ్ మేనేజరు సంపత్‌కుమార్, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ప్రేమ్‌సాగర్, డీసీఈబీ ప్రసాద్ పాల్గొన్నారు.

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించాలి: ఏఐఎస్‌యూ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 24 : జిల్లాలో కేజీబీవీ హాస్టల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో కస్తూర్బా గాంధీ పాఠశాలలు, కళాశాల హాస్టళ్లు సమస్యలకు నిలయంగా మారాయన్నారు. మెనూ అమలు చేయడంలేదని, విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారన్నారు. హాస్టల్స్‌లో స్పెషల్ అధికారులు ప్రభుత్వ నియమనిబంధనలు పాటించకుండా విద్యార్థులకు సౌకర్యాలు అందించకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఉడికీ ఉడకని అన్నం, పలుచటి మజ్జిగ ఇస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ చేసి తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే హాస్టళ్లకు రెగ్యులర్ స్పెషల్ అధికారి లేకపోవడం వల్ల టీచర్ల కొరతతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. నైట్ డ్యూటీ టీచర్లు కూడా సక్రమంగా తమ విధులు నిర్వహించంలేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

సెల్ఫ్ అసెస్‌మెంటు ప్రశ్నపత్రాల సరఫరా హర్షణీయం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 24 : సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షల ప్రశ్నపత్రాలను రాష్ట్ర విద్యాశాఖ పాఠశాలలకు సరఫరా చేయడం హర్షణీయమని ఏపీటీఎఫ్ అమరావతి ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్‌చంద్ర, అలీఖాన్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో వాట్సప్ ప్రశ్నాపత్రాలతో గందరగోళం మధ్య విద్యార్థులు పరీక్షలు రాసేవారని, దీన్ని నివారిస్తూ ముద్రణ ప్రశ్నపత్రాలు పంపిణీ చేయడం విద్యార్థులకు అనుకూలమ న్నారు. ఈ విషయాన్ని గతంలోనే మీడియా ద్వారా అధికారుల దృష్టికి ఏపీటీఎఫ్ తీసుకువెళ్లిందన్నారు. దీనికి కార్యరూపం దాల్చడం మరింత మెరుగైన ఫలితాలకు శ్రీకారం చుట్టడమే అవుతుందని వివరించారు. ప్రశ్నాపత్రాలను మండల పాయింట్ నుంచి స్కూలు పాయింట్లకు సరఫరా విషయంలో ఉన్న అసౌకర్యాన్ని విద్యాశాఖ అధికారులు నివారించేలా చర్యలు చేపట్టాలన్నారు.

వృషభాచలేశ్వర దేవస్థాన పాలక మండలికి నోటిఫికేషన్ విడుదల

వేంపల్లె, ఆగస్టు 24: వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి ఏర్పాటుకు దేవదాయ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు కర్నూలు డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వంలో దేవస్థాన పాలకమండలి గడువు పూర్తయింది. ఈలోగా టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. తాజాగా పాలక మండలిని ఏర్పాటు చేసుకునేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. త్వరలో పాలక మండలి ఏర్పాటు కానుంది. కాగా ఇప్పటికే చైర్మన్ అభ్యర్థిగా చింతలమడుగుపల్లెకు చెందిన పీవీ రమణను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి ప్రకటించారు.

బహుమతుల పంపిణీ

వేముల, ఆగస్టు 24: వేముల కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థినులకు బహుమతులు పంపిణీ చేసినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ సునీత తెలిపారు. ఈనెల 14వ తేదీన విద్యార్థినులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. అనంతరం చైల్డ్‌హెల్ప్ లైన్, బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. కీర్తన, మహాలక్ష్మి, పూజిత ఉత్తమ ప్రతి భ కనబరచడంతో వారికి బహుమతులు అందించారు. ఐసీడీఎస్ సిబ్బంది, ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణమాస వేడుకలు

సీకేదిన్నె, ఆగస్టు 24: చింతకొమ్మదిన్నె మండలంలో శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. బయనపల్లె అభయ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎఎల్ కాలనీ, బుసిరెడ్డిపల్లె గ్రామాల సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి చెక్కభజనలు, అన్నదానాలు ఏర్పాటు చేశారు. ఏఎల్‌కాలనీలోని అభయహస్త ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

కృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేయాలి

వేంపల్లె, ఆగస్టు 24: వేంపల్లె వడ్డెవీధిలోని శ్రీకృష్ణ దేవస్థానంలో 26న జరిగే శ్రీకృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8.35 నుంచి స్వామివారికి అభిషేకం, గోపూజ తులసిపూజ, మంగళహారతి తదితర పూజాకార్యక్రమాలు ప్రధాన అర్చకులు శ్రీదుర్వాక ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాలను తిలకించి ఆనందపరవశులు కావాలని, శ్రీకృష్ణభగవానుడి కృపకు పాత్రులు కావాలన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం

పెండ్లిమర్రి, ఆగస్టు 24: జిల్లాలో ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన వెయ్యినూతల కోన లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మూడవ శ్రావణ శనివారం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కళ్యాణం అంగరంగవైభవంగా వేదపండితులు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజ నిర్వహించారు. కోలాటం ఇతర కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

కడప (మారుతీనగర్), ఆగస్టు 24 : కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్‌కాలేజీ)లో జవహర్ నాలెడ్జ్ సెంటరు (జేకేసీ) ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహిస్తున్న జాబ్‌మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ ఉత్తీర్ణులై 27 సంవత్సరాలు వయసు కలిగిన (పురుషులు) ప్రొడక్ట్ డిపార్ట్‌మెంటులో జూనియర్ కెమిస్ట్రీకి అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, బయోడేటా, పాస్‌పోర్టు సైజు ఫోటోలు, జిరాక్స్ సెట్‌తో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు సీవీ రవీంద్రారెడ్డి, పార్థసారథిలను (9390052901, 9347256400)లను సంప్రదించాలని కోరారు.

న్యాక్ పీర్ టీం మెంబరు కో ఆర్డినేటరుగా శ్రీనివాసులు


ప్రొఫెసరు బాలినేని శ్రీనివాసులు

కడప (ఎడ్యుకే షన్), ఆగస్టు 24 : వైవీయూ ఎకనామిక్స్ ప్రొఫెసరు బాలినేని శ్రీనివాసులు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ టీంలో మెం బరు సమన్వయకర్తగా నియమితులయ్యారు. ఈ టీం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో ఉన్న గవర్నమెంట్ సంజయ్ గాంధీ, స్మృతి పోస్టు గ్రాడ్యుకేషన్ కళాశాలను ఈ నెల 28న సందర్శించనుంది. ఈ బృందంలో ప్రొఫెసరు శ్రీనివాసులుతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన వైస్‌చాన్సలర్లు, ప్రొఫెసర్లు ఉన్నారు. బృందంలో నియమితులు కావడం పట్ల వైవీయూ వైస్‌చాన్సలర్ కె.క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు రఘునాథరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పద్మ, అధ్యాపకులు అభినందించారు.

పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలి

వేంపల్లె, ఆగస్టు 24: వేంపల్లెలో పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని పలువురు కోరుతున్నారు. శనివారం వేంపల్లె బస్టాండ్ వద్ద సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయని బాధితులు తెలిపారు. గండికి వెళ్లేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు బస్సు ఎక్కి, దిగే సమయంలో ఫోన్లను పోగొట్టుకున్నారన్నారు. పోలీసులు పలు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచి ఇలాంటివి జరగకుండా చూడాలని ఈ సందర్భంగా విన్నవించారు.



తనిఖీల్లో 1.560 కిలోల బంగారు స్వాధీనం

● బంగారం విలువ రూ.కోటీ ఐదు లక్షలు

● ఇన్‌కమ్‌ట్యాక్స్‌కు అప్పగిస్తున్నట్లు సీఐ వెల్లడి



స్వాధీనం చేసుకున్న బంగారం పంచనామా అందిస్తున్న సీఐ

కడప (క్రైం), ఆగస్టు 24: వాహనాల తనిఖీలో 1.560 కిలోల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు కోటి ఐదు లక్షల రూపాయలు ఉంటుందని ఆయన వెల్లడించారు. వివరాల్లోకెళితే... కడప నగరం రెండో గాంధీ బొమ్మ వద్ద ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కడప ఇన్‌చార్జ్ పోలీసు అధికారి వెంకటరాముడు సూచనల మేరకు వన్‌టౌన్ సీఐ భాస్కరరెడ్డి, ఎస్ఐలు అమర్‌నాథరెడ్డి, రంగస్వామి సిబ్బందితో వాహన తనిఖీ చేపట్టారు. టీకేఎం స్ట్రీట్ వాసి దేశ్‌ముఖ్ భరత్‌రాజారావ్ బైక్‌లో బ్యాగుతో వెళుతుండగా అతన్ని తనిఖీ చేశారు. బ్యాగులో కేజీ 560 గ్రాములు బంగారు బిస్కట్లు, కడ్డీలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. బంగారు సంబంధిత బిల్లులు తన వద్ద లేవన్నారు. బంగారు బ్లాక్‌లో అమ్ముతున్నట్లు గుర్తించామన్నారు. తదుపరి చర్యలు నిమిత్తం సీజ్ చేసిన బంగారాన్ని తిరుపతిలోని ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంటుకు అప్పగించనున్నట్లు తెలిపారు.

వృద్ధురాలిని మోసగించి రూ.70వేలు విత్‌డ్రా

- సీఐకి ఫిర్యాదు చేసిన బాధితురాలు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న ఆదిలక్షుమ్మ

చెన్నూరు, ఆగస్టు 24: కనుపర్తికి చెందిన దండుబోయిన ఓబన్న భార్య ఆదిలక్షుమ్మ బ్యాంకు ఖాతా నుంచి వెంకటేశ్ రూ.70వేలు డబ్బును డ్రా చేసుకున్నట్లు బాధితురాలు సీఐ పురుషోత్తంరాజుకు శనివారం ఫిర్యాదు చేశారు. చెన్నూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఆదిలక్షుమ్మకు 91131107823 ఖాతా ఉంది. ఇందులో రూ.70వేలకు పైగా నగదు నిల్వ చేసుకుంది. అయితే అదే గ్రామస్థుడ వెంకటేశ్ ఆమెను మోసగించి విత్‌డ్రా ఫారంలో బొటనవేలి గుర్తు వేయించుకుని బ్యాంకు నుంచి రూ.70వేలు డ్రా చేసుకున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. పైగా ఎందుకు డ్రా చేసుకున్నావని అడిగితే అతను గొడవకు దిగుతున్నాడని, దుర్భాషలాడుతున్నాడని బాధితురాలు, ఆమె భర్త సీఐకు వివరించారు. తనకు జరిగిన అన్యాయంపై విచారించి డబ్బు తనకు ఇప్పించేలా చూడడం, తనను మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది. సీఐ మాట్లాడుతూ విచారణ చేపట్టి బాధితురాలికి న్యాయం చేస్తామని ఆవేదన చెందవద్దన్నారు. బ్యాంకు లావాదేవీలు జరపాలంటే బ్యాంకు సిబ్బంది, లేదా కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాలే తప్ప బయటి వ్యక్తులను ఆశ్రయించవద్దని సీఐ హెచ్చరించారు.

హోం మినిస్టర్‌పై ట్రోల్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కడప (క్రైం), ఆగస్టు 24: హోం మినిస్టర్ వంగలపూడి అనితను సోషల్ మీడియాలో ట్రోల్ చేసిన వ్యక్తిపై చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఇటీవల హోం మినిస్టర్‌కు వ్యతిరేకంగా ప్రచార మాధ్యమాల్లో వీడియోలు ట్రోల్ చేస్తుండడంతో టీడీపీ కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పంచాయతీలను నిర్వీర్యం చేసిన వైసీపీ

వేంపల్లె, ఆగస్టు 24: పంచాయతీలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి అన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి పంచాయతీలను నిర్లక్ష్యం చేసిందన్నారు. వేంపల్లెలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించడం, గ్రామ సభల్లో ఉపాధి హామీపథకం పనులకు ఆమోదం తీసుకోవడం, గ్రామ పంచాయతీలకు రూ.2500కోట్లు విడుదల చేయడం ముదావహమన్నారు. నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

కాటేసిన ఖరీఫ్

● ఎడారిగా మారిన వ్యవసాయ భూములు
● గణనీయంగా తగ్గిన సాగు
● ఆదాయాన్ని కోల్పోతున్న రైతులు
● రబీపైనే రైతుల ఆశలు

గాలివీడు, ఆగస్టు 24: కరువు కాటకాలకు నిలయమైన రాయలసీమ జిల్లాల్లోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం ఇది. ఈ ప్రాంతీయులు నిత్యం కరువు కాటకాలతో పోరాడుతూనే ఉంటారు. ఒకప్పుడు పంట పొలాలతో కళకళలాడే భూములు, నేడు వర్షాలు లేక పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వేలాది ఎకరాలు బీడు భూములుగా మారిపోయాయి. ఫలితంగా రైతులు లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఈ ఏగాది రైతులను ఖరీఫ్ కాటేసినట్లు అయ్యింది. వివరాల్లోకి వెళితే...


రాయచోటి నియోజకవర్గం గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి మండలాలు కొన్నేళ్లగా కరువు కాటకాలకు నిలయంగా మారింది. ఇందులో 80 శాతం కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతీయులు ఖరీఫ్‌లో వేరుశనగ, వరి ఎక్కువగా సాగు చేసేవారు. మెట్ట, ఎగుడు, దిగుడు భూములతో కూడిన ప్రాంతం కాబట్టి ఈ భూముల్లో వేరుశనగను అధిక విస్తీర్ణంలో సాగు చేసేవారు. నియోజకవర్గ వ్యాప్తంగా 80 వేల ఎకరాలకు పైబడి వేరుశనగ సాగు భూమి కలదు. 30 వేల ఎకరాలకు పైబడి వరిని, మరికొంత భూమిలో ఇతర పంటలు, మామిడి, జామ, సపోట వంటి తోటలను పెంచుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల ఎకరాల్లో కూడా వేరుశనగ సాగు చేసిన దాఖలాలు లేవు. వరి కనీసం కనుచూపు మేర కూడా కనపడలేదు.



పంటలకు నోచుకోని వ్యవసాయ భూములు

సాధారణంగా మే, జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు కురిసి ఉంటే వేరుశనగ అధిక విస్తీర్ణంలో సాగు చేసేవారు. కానీ ఆ నెలల్లో తీవ్ర వర్షాభాయలు నెలకొనడంతో వేలాది ఎకరాలు బీడు భూములుగా మారిపోయాయి. ముఖ్యంగా గాలివీడులో 30 వేల ఎకరాలు, సంబేపల్లెలో 20 వేలు, చిన్నమండెంలో 18 వేలు, రామాపురంలో 19 వేలు, లక్కిరెడ్డిపల్లెలో 19 వేలు, రాయచోటి రూరల్ 21 వేల ఎకరాలు సాగు భూమి కలదు. ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఆ భూములన్నీ ఎడారిని తలపిస్తున్నాయి. గతంలో రాయచోటి నియోజక వర్గంలో వేరుశనగను రారాజు పంటగా అభివర్ణించే వారు. సెంటు బీడు భూమి లేకుండా వేరుశ నగను సాగుచేసే వారు. ఏ ఇంట్లో చూసినా వందల బస్తాలు వేరుశనగ మూటలతో నిండి ఉండేది. ఒకప్పుడు పల్లెల్లోని రైతులు తాము పండించిన వేరుశనగ కాయలు అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయంతో పట్టణాల్లో స్థలాలు, ఇళ్లను కొనుగోలు చేశామని చెప్పేవారు. నేడు ఆ పరిస్థితులు లేవు. రైతుల పరిస్థితి దీనావస్థలో ఉంది. వర్షాలు లేక పంటలు సాగులేక బతుకు బండి నడపడం భారమైపోతోం దని రైతులు వాపోతున్నారు. కనీసం రబీ సీజన్‌లో నైనా వర్షాలు పడితే రైతులకు కొంత మేరకు ఉపశమనం కలుగుతుందని వర్షాలు పడకపోతే ఊర్లైనా ఖాళీ చేసి వలస వెళ్లిపోవాల్సి ఉంటుందని పలువురు రైతులు పేర్కొన్నారు.

రబీపైన మా ఆశలు



ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలుపడక పోవడంతో పంటలను సాగు చేయలేదు. బోరుబావుల కింద ఏదోకొద్దిగా సాగు చేశాము. వరి సాగనేది లేకుండా పోయింది. కానీ రబీలోనైనా వర్షాలు కురిస్తే వరి, వేరుశనగను సాగు చేసి కుటుంబాలను పోషించుకుంటాము. ఖరీఫ్‌లో కూడా వర్షాలు పడకపోతే ఊర్లకు ఊర్లు ఖాళీ చేయవల్సిన పరిస్థితి నెలకొంటుంది.

శివప్పనాయుడు, గొట్టివీడు

లక్షల్లో ఆదాయం కోల్పోయాము



గతంలో వర్షాలు సకాలంలో కురిసేవి. తద్వారా ఖరీఫ్ సీజన్‌లో ఒక సెంటు భూమికూడా ఖాళీగా ఉండేదికాదు. మొత్తం భూమిలో వేరుశనగ సాగు చేసేవాళ్లము. ఒక్కొక్కరు వంద నుంచి 200 బస్తాలు వేరుశనగను పండించేవారము. కానీ నేడు ఈ ఏడాది వర్షాలు సకాలంలో పడ లేదు. తద్వారా రైతులందరూ లక్షల్లో ఆదాయాన్ని కోల్పోయాము.

పిచ్చయ్య, పూలుకుంట

నీట్ పీజీలో దివ్యకు 178వ ర్యాంకు



జమ్మలమడుగు, ఆగస్టు 24: స్థానిక ఓంశాం తివీధి వాసి మైలవరం ఈఓపీఆర్‌డీ వై.రామచంద్రారెడ్డి, వై.శ్రీదేవి కుమార్తె వై.దివ్యప్రీతి నీట్ పీజీలో 178వ ర్యాంకు సాధించి ప్రతిభ కనపరిచినది. ఈనెల 11న జరిగిన నీట్ పీజీ (నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సు) ఎంపిక పరీక్ష జరిగింది. ఈ పరీక్షలో వై.దివ్యప్రీతి జాతీయస్థాయిలో 178వ ర్యాంకు సాధించినట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ఈ పరీక్షకు దేశంలోని సుమారు 2.40 లక్షల మంది వైద్య విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ప్రతిభ కనపరిచిన డాక్టర్ వై.దివ్యప్రీతి ఎంబీబీఎస్ కోర్సు కర్నూలు మెడికల్ కళాశాలలో చదివింది. నీట్ పరీక్షలో ప్రతిభ కనపరిచినందుకు తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తేజేశ్వర్‌కు స్టేట్ 50వ ర్యాంక్



కాశినాయన ఆగస్టు:24: ఉప్పలూరు రైతు బిడ్డ పాలకొలను తేజేశ్వర్ శుక్రవారం విడుదలైన మెడిసిన్ పీజీ ఫలితాల్లో ఆల్‌ఇండియాలో 2900 ర్యాంక్, స్టేట్‌లో 50వ ర్యాక్ సాధించాడు. ప్రభుత్వ కాలేజీలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ వస్తుందని ఆశాభావం వ్యక్తచేశారు. సామాన్య రైతు కుటుంబీకుడు పాలకొలను రమణారెడ్డి ఇంద్రావతి దంపతుల మొదటి కుమారుడు తేజేశ్వర్‌రెడ్డి మెడిసిన్ ఫ్రీసీట్ సాధించి హైదరాబాద్‌లోని మేడ్చల్ మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తిచేశాడు. వీరి రెండో కుమారుడు కూడా ఎంబీబీఎస్ ఫ్రీసీట్ సాధించి కుప్పంలో చదువుతున్నాడు. ఇద్దరు కొడుకులు డాక్టర్లు కావడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. ఉప్పలూరులో ఒకరు మెడిసిన్ పీజీ, మరొకరు పీజీలో ర్యాంక్ సాధించారు. మరో ముగ్గురు విద్యార్థులు ఎంబీబీఎస్ చదువుతుండడం విశేషం. తేజేశ్వర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ పట్టాను అందుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కానిస్టేబుల్‌కు గాయాలు



గాయపడిన కానిస్టేబుల్ కృష్ణయ్య

రామాపురం, ఆగస్టు24: ఆంజనేయస్వామి గుడి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బెటాలియన్ కానిస్టేబుల్ రేఖం కృష్ణయ్యకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... కడప టౌన్‌లో నివాసముంటున్న కృష్ణయ్య తన స్వగృహం కొత్తపల్లికి బైక్‌లో వచ్చి బంధువులను కలిసి మాట్లాడి తిరిగి కడపకు వెళ్తుండగా గువ్వలచెరువు సమీప ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ సంఘటనలో కానిస్టేబుల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. రామాపురం ఎస్ఐ సిబ్బందితో చేరుకుని తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

మైలవరం, ఆగస్టు 24: అప్పుల బాధ తాళలేక అయ్యవారిపల్లి రైతు చిట్టిబోయిన క్రిష్ణయ్య (50) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు క్రిష్ణయ్య రెండెకరాల పొలంలో జీవనం సాగించేవాడని వర్షాలు లేక సమయానికి పంట సాగు చేసిన పంటలు పండక పలువురి వద్ద దాదాపు రూ.15 లక్షలకు పైగా అప్పు చేశాడని, తన కుమారులను బీటెక్ చదివించాడని వారికి ఉద్యోగాలు రాక పోవడంతో అప్పు తీర్చలేనని భయంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో గడ్డి మందు తాగి ఇంట్లో పడిపోయి ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జమ్మలమడుగుకు హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన చికిత్సల కోసం కర్నూల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించిన జేసీ



పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

మైదుకూరు రూరల్, ఆగస్టు 24: శెట్టివారిపల్లె రెవెన్యూ పొలంలో ఫ్రీహోల్డ్ ఆఫ్ అసైన్మెంట్ భూములను శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పరిశీలించారు. ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి డీకేటీ భూములను, వాటికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఆమెతో పాటు ఆర్‌డీఓ చంద్రమోహన్, తహసీల్దార్ రాజసింహనరేంద్ర తదితరులున్నారు.

క్రైస్తవ ఆస్తులను అమ్మే హక్కు ఎవరికీ లేదు

క్రైస్తవ రక్షణ కమిటీ నేత కే.దేవానంద్



సమావేశంలో మాట్లాడుతూన్న క్రైస్తవులు

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 24: రాయలసీమ జిల్లాల్లో ఉన్న ఎస్‌పీఎల్‌సీ చర్చి ఆస్తులను అమ్మే హక్కు ఎవరికీ లేదని క్రైస్తవ రక్షణ కమిటీ నేత కే.దేవానంద్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌పీఎల్‌సీ చర్చిలో క్రైస్తవులు నిర్వహిస్తున్న నిరాహార దీక్షలో పాల్గొన్ని వారికి ధైర్యం చెప్పారు. పట్టణంలో ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా కూల్చిన చర్చి బంగ్లా గోడను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ జయరావు, విజయ్ కుమార్ వర్గాలకు చర్చి ఆస్తులు అమ్మే హక్కు లేదని స్పష్టం చేశారు. కలెక్టర్ చొరవ తీసుకుని మిషనరీ ఆస్తులను కాపాడాలని కోరారు. త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి క్రైస్తవ ఆస్తులను రక్షించాలని విన్నవించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వేడుక రాజరత్నం, కూని చంద్రయ్య, భాస్కర్, సంతోష్, జోసఫ్, మరి కొందరు రిలే నిరహర దీక్షలో పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



రమణయ్య (ఫైల్)

అట్లూరు, ఆగస్టు 24: కొండూరు బీసీ కాలనీ వాసి బత్తుల రమణయ్య (45) శనివారం తెల్లవారు జామున బాకరాపేట సమీప రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఛిద్రమైనట్లు బంధువులు తెలిపారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రమణయ్య, బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడని శుక్రవారం ఉదయం బేల్దారి పనికి తిరుపతికి పోతున్నట్లు భార్య తిరుపాలమ్మకు చెప్పా డు. సాయంత్రం వరకు తిరుపతికి చేరకపోవడంతో భార్య ఆందోళనతో విషయానికి బంధువులకు తెలిపింది. శనివారం ఉదయం రైలు కింద పడి మృతి చెందినట్లు అతని దగ్గర ఉన్న ఫోన్‌బుక్‌లో ఫోను నెంబర్లతో రైల్వేసిబ్బంది వెంకటసుబ్బయ్యకు ఫోను చేయగా రమణయ్య మృతి చెందినట్లు భార్య తిరుపాలమ్మకు తెలిపారు. రమణయ్య మృతదేహాన్ని బంధువులు కొండూరుకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి ఒక కూతురు కొడుకు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



రామలక్షుమ్మ మృతదేహం

ముద్దనూరు ఆగస్టు24: స్థానిక హోసన్న చర్చి వద్ద ప్రమాద వశాత్తు బైకుపై నుంచి పడి గాయపడి చికిత్స పొందుతున్న రామలక్షుమ్మ (51) శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. భాగ్యనగర్ కాలనీ వాసి రామలక్షుమ్మ ఆమె కుమారుడుతో కలిసి గురువారం బైకుపై ఎర్రగుంట్లకు వచ్చి తిరిగి జమ్మలమడుగుకు వెళుతున్నారు. హోసన్న చర్చి వద్ద బైకు చక్రంలో చీరె కొంగు ఇరుక్కోవడంతో ప్రమాదవశాత్తు రోడ్డుపై పడి తీవ్రగాయాలపాలైంది. వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు జనరల్ ఆస్పత్రికి తరలిస్తే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్లానింగ్ సెక్రటరీపై వేటు

బద్వేలుటౌన్, ఆగస్ట్ 24: అనధికార నిర్మాణాలను ఆపడంలో నిర్లక్ష్యం వహించినందుకు వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ బయ్యారపు శేఖర్‌ను సస్పెండ్ చేశారు. బద్వేలు పురపాలక సంఘం మడకలవారిపల్లె గ్రామం గోపవరం మండల ప్రభుత్వ స్థలం సర్వేనెంబర్ 973/3లో 2.34ఎకరాల స్థలం ఉంది. ఇందులో చేపడుతున్న అనధికారిక నిర్మాణాలను అడ్డుకోవడంలో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ విధుల్లో నిర్లక్ష్యం వహించాడు. ఈవిషయమై సీసీఏ రూల్స్ 1991 మేరకు కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ సస్పెండ్ చేశారు.

ఏపీఓను తిట్టారని కేసు నమోదు

కొండాపురం, ఆగస్టు 24: వెంకయ్యకాలువ గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఏపీఓను తల్లినందుకు పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామసభలో ఉండగా తిరుమల మారుతి కుమార్ అసభ్యకరంగా దూషించాడని ఏపీఓ సుబ్బమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు మారుతికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు

డీఈఓకు ఉద్యోగ సంఘం అధ్యక్షుడు వినతి

కడప(కలెక్టరేట్) ఆగస్టు24: అట్లూరు మండలం, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ జి.ఫణీ శ్రీని కొందరు మండల నేతలు రాజకీయ దురుద్దేశంతో ఆరోపణలు చేసి వేధించడం తగదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం డీఈఓ అనురాధను కలసి వినతి పత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ ఈవిద్యా సంవత్సరం ప్రారంభం నుంచీ విద్యాకమిటీ ఎన్నికల తరువాత ఆమెపై రాజకీయ వత్తిడులు పెరిగాయన్నారు. వాస్తవాలు పరిశీలించి న్యాయం చేయాలని డీఈఓను కోరారు.

పోటీతత్వం కలిగి ఉండాలి : జేసీ



విద్యార్థికి జ్ఞాపిక అందిస్తున్న జేసీ అదితిసింగ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 24: ప్రతి విద్యార్థి పోటీతత్వం కలిగి ఉండాలని జేసీ అదితిసింగ్ అన్నారు. నేషనల్ స్పేస్‌డే సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ ఆధ్వర్యంలో చంద్రయాన్-3పై విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో న్యూమాడల్ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. వారికి జేసీతో కలిసి డీఈఓ అనురాధ బహుమతి అందించారు. హైస్కూలు ఏఓ షర్మిల, విజయ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పీరు లభ్యం

చిట్వేలి, ఆగస్టు 24: ఎల్లమరాజుచెరువులో పురాతన రాగితో చేసిన పీరు దొరికింది. శనివారం చెరువులో క్రికెట్ ఆడుతున్న యువతకు పీరు దొరకడంతో తోపుల వీధిలోని పీర్లచావిడికి తెచ్చి పూజలు చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పీరును చూడడానికి తండోపతండాలు చావిడికి విచ్చేశారు. మొహర్రం వేడుకలు 40 రోజులు పూర్తయిన సమయంలో ఈ పీరు దొరకడం శుభసూచకమని ముస్లింలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పీరు దాదాపు 200 ఏళ్ల చరిత్ర కలిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. పీరుకు ప్రత్యేక పూజలు చేశారు.

అధిక రేట్లకు అమ్మితే సీజ్ చేస్తాం

● డీబీటీ చేసి రైతులకు ఎరువులు ఇవ్వాలి : జేడీ



పంటలను పరిశీలిస్తున్న జేడీ

ఖాజీపేట, ఆగస్టు 24: అధిక రేట్లకు ఎరువులను అమ్మితే దుకాణాలు సీజ్ చేస్తామని జేడీ నాగేశ్వరరావు అన్నారు. శనివారం తుడమలదిన్నెలో పత్తిపంటను పరిశీలించారు. అనంతరం ఖాజీపేటలోని ఎరువు దుకాణాలు ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసిన పంటను శ్లాబ్‌బుకింగ్ చేసుకోవాలని, పొలం చుట్టూ పసుపు రంగు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి దుకాణదారుడు డీబీటీ తప్పనిసరిగా చేయాలని, జిల్లా నుంచి వచ్చిన రిపోర్టు, ఇక్కడ ఉన్న స్టాకు సరిపోయిందన్నారు. డీబీటీ చేయకపోతే జిల్లాకు ఎరువులు రావని, ఎరువులు సకాలంలో అందాలంటే డీబీటీ తప్పనిసరన్నారు. ఎరువులు కొన్న ప్రతి రైతు బిల్లులు తీసుకోవాలని, అధిక రేట్లకు ఎరువులు అమ్మితే దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. యూరియా రూ.267 మాత్రమే చెల్లించాలని, ఎక్కువ ధరకు అమ్మినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగార్జున, వీపీఏ జమాలమ్మ, సర్పంచ్ క్రిష్టారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భారీ స్కోరు దిశగా చిత్తూరు - ఎదురీదుతున్న నెల్లూరు

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 24: కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 23 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా వివిధ జట్ల మధ్య సాగుతున్న మూడురోజుల క్రికెట్ మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 395 పరుగుల భారీ స్కోరు దిశగా సాగుతోంది. మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 172 పరుగుల వెనుకంజలో ఎదురీదుతోంది. వివరాలిలా..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో...

నగరశివారు ప్రాంతం కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో శనివారం చిత్తూరు - కడప జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గి చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 395 పరుగులు చేసింది. ఇందులో వై.తేజారెడ్డి 122 పరుగులు (136 బాల్స్) సాధించారు. వీరి తో పాటు మరో బ్యాట్స్‌మెన్ ధరణికుమార్‌నాయుడు 60 పరుగులు చేయగా, కె.నిఖిత్ (బ్యాటర్) 60 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. బౌలింగ్‌లో కడప జట్టు బౌలర్ ఆదిల్‌హుసేన్ 3 వికెట్లు సాధించారు.

ఏసీఏ మైదానంలో...

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు - కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్‌నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్ చేపట్టి తొలి ఇన్నింగ్స్‌లో 62.0 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో ఎ.సాయిసూర్యతేజారెడ్డి 92 పరుగులు చేయడం విశేషం. తదనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 87 పరుగులతో ఎదురీదుతోంది. ఇందులో భార్గవ్ 23 పరుగులతో, పర్వత్ ఖాద్రి 18 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో నెల్లూరు జట్టు మరో 172 పరుగుల లోటుతో ఎదురీదుతోంది.



తేజారెడ్డి (చిత్తూరు)



కె.నిఖిత్ (చిత్తూరు)



సూర్యతేజరెడ్డి (కర్నూలు)

వన్‌టౌన్ సీఐగా రామకృష్ణారెడ్డి



ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 24 : వన్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రామకృష్ణారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కమలాపురం సీఐగా పని చేస్తూ బదిలీపై ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అండగా ఉంటామని, వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు సాగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మైదుకూరు అర్బన్ సీఐగా సయ్యద్ హసం



మైదుకూరు రూరల్ ,ఆగస్టు 24: మైదుకూరు అర్బన్ సీఐ గా సయ్యద్ హసం శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన గతంలో అన్నమయ్య జిల్లాలో సీఐగా విధులు నిర్వహించారు.బాధ్యతలు తీసుకొన్న అనంతరం ఆయన డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను కలిశారు.

రేపు జన్మాష్టమి వేడుకలు

జమ్మలమడుగు, ఆగస్టు 24: జమ్మలమడుగులో ఈనెల 26వ తేదీ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు త్రైతసిద్ధాంత ప్రభోద సేవా సమితి ఇందు జ్ఞానవేదిక కమిటీ వారి ఆధ్వర్యంలో జరుగునని తెలిపారు. శనివారం జమ్మలమడుగు పట్టణంలో ఆర్డీవో శ్రీనివాస్, కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, సీఐ లింగప్ప, ఇతర అధికారులకు ఆహ్వాన పత్రికలు అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రంగనాయకులు, నరసింహ, నాగరాజు, చలపతి, మల్లీశ్వరి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

గోపవరం, ఆగస్టు 24 : నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ప్రజలకు కల్పించామని బద్వేలు విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.కుళ్లాయప్ప తెలిపారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం బద్వేలు, గోపవరం, అట్లూరు, బ్రహ్మంగారిమఠం మండలాల పరిధిలో విద్యుత్ చార్జీల వసూలు కేంద్రాలు పనిచేస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ, బద్వేలు ఏఈలు రమణ, చిన్నయ్య, విజయకుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం రైతన్నల ఎదురుచూపులు

● కేసీ కెనాల్‌కు కొద్దిమేర నీరు.. కొన్ని చోట్ల వృథాగా పోతున్న వైనం ● తొమ్మిది గంటలు విద్యుత్తు ఇవ్వాలి అంటున్న రైతన్నలు

ఖాజీపేట, ఆగస్టు 24: ఆరుగాలం కష్టపడే రైతన్నలకు దేవుడు ఏదో ఒక రూపంలో ఆగ్రహిస్తున్నాడు. అన్ని చోట్లా వర్షం కురిసి కాలువలు, నదులు పొంగి పొర్లుతుంటే జిల్లాల్లో అంతంత మాత్రంగా పడింది. అన్ని డ్యాంలు పుష్కలంగా నిండాయి. ఈ ఏడాది అయినా పది రూకలు సంపాదించుకుందామనుకుంటే రైతన్నల ఆశలు అడియాసలయ్యాయి. ఏరోజు కారోజు ఈ రోజు వర్షం వస్తుంది అనుకున్న సమయంలో మేఘాలు పోతుండడంతో రైతులు పైకి ఎగచూడక చేసేది ఏమీలేక నిరాశ చెందుతున్నారు. శ్రీశైలంలో పూర్తిగా ప్రాజెక్టు నిండు కుండలా ఉండడంతో ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటలు సాగు చేసుకోవచ్చునను కున్నారు. కేసీ కెనాల్ కింద మాత్రం వరినాట్లు వేసేందుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. బోరుబావులకు మాత్రం పుష్కలంగా నీరు రాకపోవడంతో కొంత మంది రైతులు దిగాలు చెందుతున్నారు. వర్షం వస్తే తప్ప బోర్లలో పుష్కలంగా నీరు రాదని, వరి పంట సాగు చేస్తే వచ్చేనీరు పోతే నష్టం వస్తుందని, ఇప్పుడైతే విత్తనాలు ఖర్చు మాత్రమే అవుతుందని రైతన్నలు అంటున్నారు.

● **చివరి ఆయకట్టుకు నీరు అందించాలి..:** కొండపేట కాలువ కింద చివరి ఆయకట్టుకు అనుకున్న మేర నీటిని అందించడంలో అధికారులు విఫలం అయ్యారు. ఇష్టానుసారంగా కాలువకు పైన్న ఉన్న తూములకు నీరు అధికంగా పోతుండడంతో చివరి ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

● **9 గంటలు విద్యుత్తు ఇవ్వాలి..:** కనీసం విద్యుత్తు అధికారులు అయినా 9 గంటలు నాణ్యమైన విద్యుత్తు అందిస్తారనుకుంటే ఏడు గంటలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఏది ఏమైనా ఎన్డీయే కూటమి అయినా రైతుల సమస్యలు పరిష్కరిస్తుందని రైతులు వేడుకుంటున్నారు.



నాటేందుకు సిద్ధంగా ఉన్న నారుమడులు, నీరు లేక ఎండిన భూమి

● **పట్టించుకోని అధికారులు..:** కేసీ కెనాల్‌పై లస్కర్లు తిరగడం గత అయిదు సంవత్సరాలుగా ఒక్కసారిగా చూడలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారు వైసీపీ ప్రభుత్వంలో పనిచేస్తున్నామన్న భ్రమలో ఉన్నారని, ఉన్నతాధికారులు స్పందించి చివరి ఆయకట్టుకు నీరు అందేలా చూడాలని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రొద్దుటూరులో అక్రమ కట్టడాలన్నీ వైసీపీ పుణ్యమే

పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు ,ఆగస్టు 24 : ప్రొద్దుటూరులో నిర్మించిన అక్రమ కట్టడాలన్నీ గత ఐదేళ్ల వైసీపీ పాలన పుణ్యమేనని పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి ఆరోపించారు, శనివారం సూపర్ బజార్ వీధీ మోటులో నిర్మించిన అక్రమ కట్టడాన్ని టీడీపీ బృందం పరిశీలించింది. ఈసందర్భంగా ఈవీ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గాంధీరోడ్డుకు సూపర్ బజార్‌కు కార్నర్‌గా వుండే ప్రైమ్ ఏరియాలో ఎలాంటి పార్కింగ్ వసతి లేకుండా రోడ్డును ఆక్రమించి సెట్‌బ్యాక్‌లు లేకుండా పూర్తిగా అక్రమంగా షాపింగ్‌కాంప్లెక్స్ మూడు అంతస్థులు నిర్మించారన్నారు. ఈ అక్రమ నిర్మాణాలలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఆయన బావమరిది మున్సిపల్ వైస్ చైర్మెన్ బంగారురెడ్డికి భారీగా ముడుపులు ముట్టినట్లు ఆరోపించారు. అక్రమ నిర్మాణాలను అరికట్టవలసిన మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం అవినీతే లక్ష్యంగా చేసుకుని అక్రమ నిర్మాణాలను పట్టణంలో ప్రోత్సహించారన్నారు. ఇలాంటి భారీ షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎలాంటి పార్కింగ్ సెట్ బ్యాక్స్ లేకుండా ఏవిధంగా అనుమతిఇచ్చారని ప్రశ్నించారు. ఇందువల్ల ఇప్పటికే పట్టణంలో ట్రాఫిక్ పెరిగిపోయి అస్తవ్యస్తంగా తయారైందన్నారు. తక్షణమే ఈ అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కమిషనర్, కలెక్టర్‌ను కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, టౌన్‌బ్యాంక్ చైర్మెన్ సుబ్బారెడ్డి, ప్రకాష్, చెన్నయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి

వైసీపీ ప్రభుత్వంలో రాచమల్లు, బంగారురెడ్డి మాఫియా నడిపారు

టీడీపీ కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, మునీర్



మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి

ప్రొద్దుటూరు ఆగస్టు 24 : వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మెన్ బంగారురెడ్డి పెద్ద మాఫియానే నడిపారని టీడీపీ కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి, మునీర్ ఆరోపించారు. శనివారం స్థానిక ఆదిత్య కాంప్లెక్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ చాలా రోజులనుంచి మేము రాచమల్లు బంగారు రెడ్డిలు ఇసుక దోపిడీ చేస్తున్నారని చెబుతున్నామన్నారు. కానీ రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఒక్క ఇసుకరేణువు కూడా రవాణా చేయలేదని పచ్చి అబద్ధాలు చెప్పాడన్నారు. కాగా నేడు బంగారురెడ్డి స్వయంగా ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ మేము ట్రాక్టర్లతో ఇసుక తోలితే నేడు టిప్పర్లతో తోలుతున్నారని తెలిపాడన్నారు.దీనికి ఏం సమాధానం చెపుతావని రాచమల్లును ప్రశ్నించారు. ఇసుక ఒక్కటేనా మీరు నడిపింది. భూదందాలతో పాటు మట్కా, గుట్కా, క్రికెట్ బెట్టింగ్ జూదగృహాలు నడిపారన్నారు. మీ దందాలపై కథనాలు రాసిన విలేకరులను బెదిరించారన్నారు. మీకు అడ్డమొస్తే ఏకంగా మనుషులను చంపామన్నారు. రాచమల్లు ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు రాజన్న క్యాంటీన్ తెరిచి అన్నదానం ఎందుకు చేయలేదన్నారు.

'వాట్సాప్‌లో ఫొటోలు పంపండి చర్యలు తీసుకుంటాం'

మైదుకూరు, ఆగస్టు 24 : మైదుకూరు నియోజకవర్గంలో ఎక్కడైనా కరెంటు తీగలు మనుషులకు తగిలే విధంగా వేలాడుతున్నా, కూలడానికి సిద్ధంగా ఉన్న కరెంటు స్థంబాలు ఉన్నా వాట్సాప్ ద్వారా 7337433363 నెంబరుకు ఫొటోలు పంపాలని, వెంటనే చర్యలు తీసుకొనేలా చేస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పత్రికా ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ కార్యాలయంలో ప్రత్యేక బృందాల ద్వారా సమస్య 24 గంటల్లోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ఇసుక రీచ్‌ను పరిశీలించిన ఆర్డీవో

కొండాపురం, ఆగస్టు 24: మండలంలోని ఏటూరు గ్రామం వద్ద చిత్రావతి నదిలో ఇసుక రీచ్‌ను జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాస్ శనివారం పరిశీలించారు.ఇసుకను స్టాక్‌పాయింట్లకు తరలించే విషయమై అధికారులతో చర్చించారు. ప్రస్తుతం ఇసుక స్టాక్‌నిల్వ ను అడిగి తెలుసుకున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెండు చెక్‌పోస్టులను పి.అనంతపురం, ఏటూరు సమీపంలో ఏర్పాటుచేయనున్నట్లు తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగప్రసాద్, ఆర్‌ఐ ఆనందరావు సిబ్బంది పాల్గొన్నారు.

భూముల అక్రమ ఆన్‌లైన్‌లను తొలగించాలి

సావిశెట్టిపల్లె దళితుల ధర్నా



కాశినాయన, ఆగస్టు24: సావి శెట్టిపల్లె పరిధిలోని సర్వేనెంబర్ 758,778,779లల్లో స్థానిక వీఆర్‌ఏ అతని బంధువులు అక్రమంగా ఎక్కించుకొన్న ఆన్‌లైన్లను రెవెన్యూ అధికా రులు తొలగించాలని గ్రామానికి చెందిన పలువురు దళితులు శనివారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పైమూడు సర్వేనెంబర్‌లలోని మాలమాన్యం భూములపై 40 కుటుంబాలకు సంబంధం ఉందన్నారు. వారసత్వంగా వస్తున్న దాదాపు 5 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన వీఆర్‌ఏ పుష్పరాజు అతని బంధువులు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకొని అమ్ముకుంటు న్నారన్నారు. ఇటీవల కొంతభూమిని అమ్మి వేరొకరికి రిజిష్టర్ కూడా చేశారన్నారు. ఈవిషయంపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి వీఆర్‌ఏ పుష్పరాజు అతని బంధువులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. ఈవిషయంపై తహసీల్దారు బాలనరసింహులును వివరణకోరగా తాను కొత్తగా విధుల్లోచేరానని సిబ్బంది కూడా అందుబాటులో లేరని కొంత సమయమిస్తే విచారించి తగుచర్యలు తీసుకుంటానన్నారు.

మానవ మనుగడలో వృక్షాలది కీలకపాత్ర

బద్వేలు, ఆగస్టు 24: మానవ మనుగడలో వృక్షాలు కీలకపాత్ర పోషిస్తాయని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల నరసింహారెడ్డి, ఆర్‌టీవో శేఖర్ రావు, రిటైర్డ్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ బి.మునెయ్య పేర్కొన్నారు. శనివారం బద్వేలు పట్టణ అబివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. పెన్షనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మీనాక్షిరెడ్డి, బద్వేలు సీఐ రాజగోపాల్ యాదవ్, బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నానబాల వెంకటేశ్వర్లు, బద్వేలు గురుమూర్తి, గౌరవాధ్యక్షుడు కొండపల్లి చిన్న సుబ్బారావు, అసోసియేట్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి, పట్టణ అభివృద్ధి కమిటీ లీగల్ అడ్వైజర్ మురళి, మీడియా ఇన్‌చార్జి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యానేరం:సీడీపీవో



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న సీడీపీవో

కాశినాయన ఆగస్టు24:బాల్యవివాహాలు చట్టరీత్యానేరమని పోరుమామిళ్ళ ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో లక్ష్మీ పేర్కొన్నారు. శనివారం వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇటీవల చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098,181లపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభకనపరిచిన బాలికలకు బహుమతులు అందజేశారు. అనంతరం చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ పర్యవేక్షకురాలు చంద్రకళ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: బాల్యవివాహాలు అరికట్టాలని ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగే సందర్భాలుంటే వాటిని ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తేవాలని ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. శనివారం పోరుమామిళ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల ఆగస్టు 15న విద్యార్థినులకు 1098,181 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్లపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు శనివారం బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, సీడీపీవో లక్ష్మీదేవి ,రెడ్డమ్మ, కస్తూర్బాగాంధీ బాలికల ఉపాధ్యాయినులు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ కోసం పోరాడుదాం

జమ్మలమడుగు, ఆగస్టు 24: అమరులైన నేతల స్ఫూర్తితో కడప ఉక్కుకోసం పోరాడుదామంటూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జమ్మలమడుగులో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు రాజ్‌గురు జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం స్థానిక ఐటీఐ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవీన్, ఆంజి, రమేష్, శంకర్, రవి, రఘు, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

అభయాంజనేయునికి శ్రావణమాస పూజలు

మైలవరం, ఆగస్టు 24 : మండల పరిధిలోని జి.ఉప్పలపాడు గ్రామంలో వెలసిన అభయాంజనేయునికి మూడో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని భక్తులు విశేష పూజలు నిర్వహించారు.తెల్లవారుజాము నుంచే స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.జిల్లా నుంచే కాక నంద్యాల, కర్నూల్, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందచేశారు. అభయాంజనేయున్ని కన్నుల విందుగా అలంకరించారు. భజన పోటీలు నిర్వహించారు. భక్తులకు మాజీ ఎంపీటీసీ నరసింహులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

ఆదమరిస్తే అంతేసంగతులు

పరిమితికి మించిన ప్రయాణం



ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

కాశినాయన, ఆగస్టు24 : ఆటోలలో పరిమితికి మించి ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా వాహనచోదకులు, ప్రయాణికుల్లో మార్పురావడంలేదు. ప్రతిరోజు జిల్లాలో ఎక్కడో ఒకచోట అధికలోడుతో వెళ్తున్న ఆటోలు బోల్తాపడి ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అయినా ప్రజల్లో కనువిప్పుకలగడంలేదు. కాగా నర్సాపురం నుంచి పోరుమామిళ్లకు వెళ్తున్న ఓఆటోలో సాధారణ ప్రయాణికులతోపాటు పలువురు విద్యార్థులు సర్కస్ ఫీట్స్ వేస్తున్నట్లు ఆటోలో కడ్డీలమీద, వెనుకవైపు డోర్‌పై ఒంటిచేత్తోపట్టుకొని నిల్చొని ప్రయాణిస్తున్నారు. చూసేవారికిసైతం భయం కల్గించేలా వారిప్రయాణం సాగింది. ఎక్కడైనా కుదుపులవద్ద డోర్ చైన్‌తెగినా, చేయి జారినా ఇంకేదైనా పొరపాటు జరిగితే అంతేసంగతులు. ఉదయం విద్యార్థులు కాలేజీకి వెళ్లేసయయంలో అధికారులు ఈమార్గంలో ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఈకష్టాలు ఉండవు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో జీవించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 24: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో జీవించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం మదర్‌థెరిస్సా జయంతిని ఆంధ్రప్రదేశ్ మదర్‌థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో వికాస్ విహార్ మానసిక దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బస్‌పాస్‌లు, పలకలు, పరీక్ష అట్టలు అందజేశారు. మదర్‌థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు షాకీర్‌హుస్సేన్, వికాస్ విహార్ పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.